నిర్మల మొగుడు

ఖంగారు ఖంగారుగా భోజనం చేస్తున్న భర్త మానసిక పరిస్థితినీ, మొహంమీద పడుతున్న నల్లని వంకీలజుట్టునీ, అదోవిధమైన ఆనందాన్నీ అందాన్నీ సూచించే అతని రూపాన్ని చూసేటప్పటికి జాలివేసింది నిర్మలకు.

'తాపీగా తినండి. మీకిష్టమని ఈ గోంగూర పచ్చడికూడా చేశాను. మీరలాగ కంగారుగా తిని వెళ్ళిపోతే నా మనసంతా ఏదో బాధపడుతుంది.'

'ఒళ్ళమ్ముకున్నాక తప్పుతుందా మరి! ఆ రావణబ్రహ్మ ఈవేళ ఎలాగైనా నన్ను వదలడులే!'

ఈ రావణబ్రహ్మ అన్న బిరుదు ఎవరికి చెందుతుందో నిర్మలకి తెలుసు. ఆ పేరు చెప్పితే తన భర్త హోరని వర్షములో తడిసి వచ్చి కూడా గడగడా మరచెంబుడు నీళ్ళు తాగుతాడన్న విషయం కూడా తెలుసును. కాని ఎదురుగా తన భర్త అంత కంగారుగా భోజనం సరిగా చేయకుండా వెళ్ళిపోతుంటే ఆమె భరించలేకపోయింది. అందులోనూ జరిగిన రాత్రి అతనసలు భోజనమే చేయలేదు. దానికి కారణమైన కలహమూ, ఆ కలహములో మొండిపట్టు పట్టిన తనపాత్ర నిర్వహణా, ఆ కోపములోనే యిద్దరూ భోజనం మానేసి, ఒకే పెద మంచంమీద ఒకరికొకరు తగలకుండా, ఒకరివైపొకరు తిరగకుండా పడుకొని జరిపిన అసిధారావ్రత నిర్వహణమూ ఇవన్నీ నిర్మలని పశ్చాత్తప్తురాలినిగా భర్త యెడ మరీ సుముఖురాలిగా, ప్రేమచేత కరుణచేత ఆర్ద్రీహృదయగా చేసి

వేశాయి. అందులోనూ అందమైనవాడు, జుట్టు ఆ విధంగా మొహంమీద పడేవాడు, అటువంటివాడు తనకి భర్తఅయి, తన సర్వస్వమూ అయి నప్పుడు–

'మీరు ఆకూర మరోసారి కలుపుకుంటేకాని వీలులేదు. నా మీద ఒట్టే! బోడి పుద్యోగం పోతేపోతుంది– దీని తాతలాంటిది వస్తుంది. ఊ, మరి కలపండి' అంది.

ఈసారి విసనకర్ర పుచ్చుకొని విసురుతూ అతని ప్రక్కన కూర్చుంది. నవ్వుతూ పట్టుదల పట్టుతూ లాలిస్తూ అతనిచేత తిరిగీ కూర కలిపించింది. 'అయిన ఆలస్యం ఎల్లానూ అయిందిగా! ఇంకో పావుగంట లేటయితే పీకలు తీస్తారా ఏమిటి? సంసారాల్లో ఎవళ్ళకిమాత్రం ఏవో అవసరాలు రాకుండా వుంటాయా, ఆలస్యాలవకుండా వుంటాయా?' అంటూ నొక్కులు నొక్కుతూ సన్నగా దీర్ఘం తీసింది.

ఈ ఆర్గ్యుమెంటుని ఏ కోర్టులోనూ ఒప్పుకోరని తెలుసును–కాని కలహానంతరం అందులోనూ ఒక రాత్రి రాత్రి అంతా మౌనంగా వుండి, తిరిగి సంధి కలుపుకొన్న తర్వాత భార్యా భర్త లనుభవించే ఆనందం సరిక్రొత్త ప్రేమలను ఉద్రేకాన్నీ స్వచ్ఛ పరిమళాన్ని కలిగి వుంటుంది. అటువంటి పునర్నవమైన ఆప్యాయతతో భోజనం పెట్టుతూంటే, భార్య సన్నని గాజుల చప్పుడుతో విసరుతూ లాలిస్తూ ఉంటే వేరే కాంక్షించే స్వర్గమే లేకపోయింది గంగాధరానికి. ఆఫీసులూ, బాధలూ, సమస్యలూ అన్నీ చప్పున ఫేడౌట్ అయిపోయాయి. ఆ కాస్సేపట్లోను అతనికి నిత్యమూ, సత్యమూనైన బ్రహ్మానందం గోచరించింది.

ఈ సారి వాళ్ళ కబుర్లు ఒకసారి మనస్సులోంచి సమస్యా సందేహాలు దూరమైపోయిన తరువాత – ఏ అడ్డంకిలేని నదీ ప్రవాహంలాగా సాగిపోయాయి. వచ్చే సంక్రాంతి పండుగకి మామగారు ఏం బహుమతి యిస్తారో అన్న ప్రశ్ననుండీ, సినిమాలో ఫలానా నటి తాలూకు నటన యెలావున్నదో, పక్కింటావిడ కొనుక్కున్న క్రొత్తచీరలోని కొత్త ఫ్యాషన్ విశేషమూ, కో - ఆపరేటివ్ స్కీములో తాము కట్టించబోయే

చిన్న సైజు యింటికి యెన్నిగదులు ఉండాలి అన్నంతవరకు అనవసర అవసర సమాలోచనలన్నీ సాగిపోయాయి. అతనుచెయ్యి కడుక్కొని లేచేటప్పటికి ఆమె వక్కపొడుం తీసుకొచ్చి ఇచ్చింది. అతను బనీను ధరించేటప్పటికి దువ్వెనతోవచ్చి అతని పాపిడితీసింది. అతను అమెరికన్ జాకెట్ వేసుకొనేటప్పటికి జోళ్ళు రెడీగా ఎదురుగా పెట్టింది. అతను ఆమెను ముద్దుపెట్టుకొని 'వస్తాను నిర్మలా' అని యథాలాపంగా అలవాటు చొప్పున గోడమీద టైము చూచేటప్పటికి అతనికి స్పృహ వచ్చినట్టు — లేక తప్పినట్టు అయింది. కఠిన వాస్తవికత కొరడాతో కొట్టినట్లయింది అతని నీడ అతని వెనకనే వచ్చి వెన్నులో పొడిచినట్లయింది. ఉన్నపళంగా కుప్పగా కుర్చీలో కూలి 'పదకొండుంబావు!' అన్నాడు. అతని మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. తెల్లబడిన అతని మొహాన్ని, పిచ్చిగా చూస్తోన్న అతని కళ్ళను చూసి అర్ధాంగి కంగారు పడింది.

'గంటంపావు లేటు! ఆఫీసుకు వెళ్ళేటప్పటికి యింకో పావు గంటైనా పడుతుంది. ఇంక ఉద్యోగానికి నీళ్ళు వదులుకోవలసిందే. అసలే కోపిష్టి మనిషి. అందులోనూ దొరల సంక్చుయాలిటీ అంటో ఘస్తోంటాడు. అసలు మొన్న మీవాళ్ళు వచ్చిన రోజున ఆలస్యమైనందుకే మండిపడ్డాడు. తుది హెచ్చరిక అని చెప్పాడు. మీసాల మీద చెయ్యివేసి నాకొంప తవ్వే వాడు. ఏ పావుగంటో. అరగంటో ఆలస్యం అయితే సర్దిచెప్పుకో వచ్చును. ఇప్పుడేమిటి చెయ్యటం?'

నిర్మలకి ఏమీ తోచలేదు. ససంభ్రమ సవిషాద సశంకిత అయి అలాగ నించుని పోయింది. అతను కణతల్ని రెండు చేతులతోనూ అదిమి పట్టుకొన్నాడు. ఈ విధంగా ఆలస్యంగా ఆఫీసుకు దయచేసి. ఆ తప్పుని మళ్ళీ మళ్ళీచేసి ఉద్యోగం పోగొట్టుకొని, కొత్తది దొరక్క, మాసిన గడ్డంతో, లోతుకు పోయిన కళ్ళతో రోడ్లుకాస్తూ మిత్రుల్ని అణా, బేడా అడిగి బతుకుతూన్న శంకరం స్మృతిపథంలో మెలిగేటప్పటికి అతనికి ఒక్క నిమిషం ఊపిరాడలేదు. అతన్ని లాలిస్తూ భోజనం పెడుతూ,

అరగంట కన్న ఆలస్యం అవడంలోని వైపల్యాన్నీ, విపత్తునీ చూడలేక పోయానే అని బాధపడుతోంది ఆమె।

'ఛీ ఛీ - మీ ఆడాళ్ళింతే.। వెధవ సొద వేసుక్కూర్చున్నావు. ఇప్పుడు చీవాట్లు తినాలి. డిస్మిస్ అంటే గొల్లుమని ఏడుస్తూ రావాలి. రేపటి నుండి మెతుకులు కూడా వుండవు'

'అయ్యో నాకేం తెలుసండీ' అంది నిర్మల.

'ఏం తెలుసు మరి ! నీ మొగుడేమైనా కలెక్టరనుకున్నావా? మినిష్టరనుకున్నావా ? గుమాస్తా అంటే ఏమిటనుకున్నావు? ఎన్నిసార్లు చెప్పాను నీకు తొమ్మిదింటికల్లా వంట అవ్వాలనీ'-కోపంతో కేకలు వేస్తున్నాడు గంగాధరం.

'మరి మీరు తొమ్మిదింటికిగా బియ్యం పట్టించుకొని వచ్చిందీ?' అంది నిర్మల భయంగా.

మొదట తడితడిగా కనబడి. తర్వాత బలం సంతరించుకొని బిందురూపం తాల్చికొని, కనుకొలకుల నుండి రెండశ్రువులు నిర్మల కపోలాల మీద మెల్లగా జారాయి. గంగాధరానికి గబుక్కున జాలి వేసింది. అతనికి ఏ వూహ తట్టినా, ఏ అనుభూతి కలిగినా గబుక్కున కలుగుతుంది 'ఏదో కోపంలో అన్నాను నిర్మలా. నీ తప్పేమీలేదు. కాతా కొట్టు తెరిచేటప్పటికే యీ వేళ తొమ్మిదయింది. అవును కాని యిప్పుడేమిటి చేయడం?-' అన్నాడు గంగాధరం.

నిర్మల తడికళ్ళు ఒకసారి మెరిశాయి, మంచుపడుతూన్న పేకవ పొద్దు మీద చటుక్కున సూర్యకిరణాలు పడ్డట్టు బిక్కపోయిన ఆమె మొహం ఒక్కసారి వెలుగుతో ఉద్దీపమయింది. తన భర్తకి నెల నెలా వచ్చే జీతపురాళ్ళని రక్షించే ఒక ఉపాయం ఆమెకు తట్టిఉండాలి.

గంగాధరం ఆశగా ఆమెకేసి చూశాడు ఊపిరాడకుండా నదిలో కొట్టుకుపోతున్న అతనికి ఆమెలో స్ఫురించిన ఊహ అనే పడవచెక్కని పట్టుకొని గట్టుకు చేరుకోవాలనుకున్నాడు.

"నాకో ఊహతట్టిందండీ" అంది నిర్మల 'నిజంగానా' ఆతృతగా అన్నాడు గంగాధరం.

"నిజమేనండీ. మా స్కూల్లో యిదివరకు ఓ మేస్టరు ఉండేవాడు. ఆయన చాలా కోపిష్టి. పెద్దపెద్ద మీసాలతో గండుమొహంతో అచ్చంగా పెద్దపులిలాగా ఉంటాడు. ఓనాడు నేను స్కూలుకి బాగా ఆలస్యంగా వెళ్ళాను. ఆయన కళ్ళెఱ్ఱజేసి ఎందుకింత ఆలస్యమయిందని గద్దించాడు. ఒకవేళ ఆడపిల్లనని చెయ్యిచేసుకోకపోయినా, అక్కడ ఎండలో ఇసుకలో నుంచోబెడతాడు. మగపిల్లలు ఏడిపిస్తారేమో అని నా భయం. నాకు భయంతో సిగ్గుతో ముచ్చెమటలు పోశాయంటే నమ్మండి. నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది ఆయనకి మాతృప్రేమ ఎక్కువనీ. మాతృపూజ కన్నా జీవితంలో పరమార్థం మరొకటిలేదనీ– చూడండి మీరేదో కాంప్లెక్సూ గీంప్లెక్సూ అంటారు అలాగ అన్నమాట. అంతే మా అమ్మ ఊరగాయలు కోసం అటక ఎక్కబోతూ నిచ్చెనమీదనుంచి పడిందనీ, ఆమె కాలికి మర్దనా అదీ చేసి, ఆవిడకి భోజనం పెట్టి, నే నన్నంతిని వచ్చేటప్పటికి ఆలస్యమయిందనీ మాంచి వొడుపుగా అబద్ధం ఆడేశాను. దాంతో అంత పెద్దపులీ అహింసావాది అయిన మేక అయిపోయాడనుకోండి. నన్ను దగ్గరకు పిల్చి, నా తల నిమిరి, విద్యార్థులందరికి నన్నొక ఆదర్శం కింద చూపించి గౌరవించాడు మా మేష్టారు."

ఆమె ఆగింది భర్తకేసి భావయుక్తంగా చూస్తూ. పాపం భయావస్థలో నున్న గంగాధరానికేమీ స్ఫురించలేదు.

"ఈ కథకీ నా ఏడుపుకీ సంబంధం ఏమిటి ?" అన్నాడు విసుగ్గా.

భర్త తెలివితేటల్ని గురించి కొంచెం నిరసనగా, జాలిగా నవ్వి, విడమర్చి యిలా చెప్పింది నిర్మల : "చూడండి, మీ 'బాస్'లో ఎక్కడో వీక్ పాయింటు ఒకటి ఉంటుంది. దానిమీద మీరు 'ప్లే' చెయ్యాలి. ఎంత కోపంలో ఉన్నవాడైనా, అతనికి యిష్టమైన, ఆప్యాయమైన ప్రసక్తి తీసుకువస్తే చటుక్కున మెత్తబడిపోతాడు, మా మేష్టారులాగా. ధైర్యం తెచ్చుకోండి, ఆలోచించండి.

గంగాధరానికి ఆ మధ్య తోటిగుమాస్తా ఒకడు చెప్పిన విషయం సమయానికి జ్ఞాపకం వచ్చింది. ఒక్క ఉదుటునలేచి ఆమెని కావలించుకొని "మే ప్రెషస్! నువ్వు నిజంగా నన్ను రక్షించడానికి వచ్చిన దేవతవు. అందుకే కార్యేషు మంత్రి, కరణేషు దాసీ (పాపం తిరిగేశాడు కంగార్లో) అన్నారు పెద్దలు. మా అధికారికి ఓ పెద్ద వీక్‌నెస్ ఒకటివుంది. అదేమిటంటే ఆయనకి చాలా కాలం పిల్లలులేరు. ఈ మధ్యే మూడు నాలుగేళ్ళ క్రితం ఒక పిల్లాడు కలిగాడు ఆయనకి పిల్లలు అంటే ఎంతో పిచ్చట. ఆ రోజుల్లో మిఠాయీ బొమ్మలు కొని చుట్టుప్రక్కల ఉన్న పిల్లలకు వారం వారం పంచిపెట్టేవాడుట. ఇప్పటికీ ఈయన ఉన్న వీధిలో ఏ పిల్లవాడికి జబ్బు చేసినా ఈయన స్వయంగా వెళ్ళి కష్టసుఖాలు విచారించి అవసరమైతే స్వయంగా డాక్టర్నికూడా తీసుకువెళతాడుట. ఎవరికీ కానీ రాళ్ళునిపాడు నిరుపేడు అనాధ శిశుశరణాలయానికి రెండు వందలు - టూ హండ్రెండ్ - అడగ్గానే యిచ్చిపారేశాడుట. ఏదీ, నా అమెరికన్ షర్టు ఇలా పడెయ్యి. ఓహో బ్యూటిఫుల్ ఐడియా" అంటూ అతనోవిధమైన నాట్యం చేశాడు.

"మీరు షర్టు తొడుక్కునే ఉన్నారండీ" అంది నవ్వుతూ నిర్మల. గోధుమరంగు పాంటుమీద షార్కుస్కిన్ బ్లౌజువేసుకొని, జుట్టు అందంగా మొహంమీద పడుతుంటే సైకిలెక్కి సంతోషంగా వెళ్ళే భర్తను చూసి నిర్మల మళ్ళీ ఒకసారి సరికొత్తగా ప్రేమించినంత ఆనందమును, గర్వమూ పొందింది.

గంగాధరం వచ్చినట్లు తెలిసిన మేనేజరు తన గదిలోంచి గంగాధరాన్ని పిలిచాడు. మాంచి ధీమాగా, ఏ సంకోచమూ లేకుండా వెళ్ళే గంగాధరాన్ని చూచి సోదర గుమాస్తాలంతా తమ కళ్ళని తామే నమ్మలేక ఒక్కసారి కళ్ళు నులుముకు చూశారు వినయంగా మేనేజర్ ముందు నిలబడ్డారు గంగాధరం.

'నీ ప్రవర్తన నాకర్థం కావటంలేదు. నీకు బొత్తిగా భయమూ, భక్తి లేకుండాపోయాయి. ఇది ఆఫీసనీ, ఇక్కడ నీవు జీతగాడివనే స్పృహ

కూడా నీకు లేనట్లుంది. ఇదివరకు నీకు మూడుసార్లు వార్నింగుయిచ్చాను. నా మాట నీకు లక్ష్యం ఉండేగా. ఇంక నీ విషయంలో కన్సిడరేషన్ ఏమీ చూపలేను. ఇంక నువ్వు ఫలితం అనుభవించక తప్పదు.' అని కోపంగా నిక్కచ్చిగా ఆరోహణావరోహణాలు పాటిస్తూన్న గొంతుతో, మీసం కొనల్ని మెలివేస్తూ కళ్ళెర్రచేస్తూ మాట్లాడే మేనేజరును చూస్తూంటే ఠీవిగా వెనకాలే నడచివెళ్ళి 'జింకని, అమ్మని' నోటకరచుకొనే పులి లోని ఒడుపూ, నిశ్చయమూ గంగాధరానికి స్ఫురించేటప్పటికి అతని గుండె కొన్ని సెకనులు పనిచెయ్యలేదు. భయం భయంగా వణికే గొంతుని సరిచేసుకొంటూ ఇలా అన్నాడు.

'చిత్తం....ఏక్సిడెంటు జరిగిందండీ...... తమరు క్షమించాలి.'

'ఏక్సిడెంటా?' ఎగాదిగా చూచాడు మేనేజరు. 'నువ్వు బాగానే వున్నావే' అన్నాడు.

'ఆఫీసుకి ఆలస్యమవుతుందేమోనని తొందరగా వస్తున్నానండి. చటుక్కున దారికడ్డంగా ఒక చిన్నపిల్లవాడు వచ్చాడండీ. సైకిలు ఆ కుట్ర వాణ్ణి ఢీకొన్నదండి.'

ఈసారి అధికారి మొహం మారిపోయింది. ఆ తరువాత, ఆవేదనా మొహంలో కనబడ్డాయి 'ఏమైంది....ఏమైంది' అన్నాడు.

'తలకీ, కాలికి గాయాలు తగిలాయండి. ఒకటే రక్తమండి. తక్షణం నా జేబురుమాలు తలకికట్టి ఆ కుర్రవాణ్ణి ఎత్తుకొని హాస్పటల్‌కి వెళ్ళానండి. అక్కడ చికిత్సచేయించి కట్టుకట్టించి, డాక్టరుగారు ఫరవాలేదన్న తరువాత ఆ కుర్రవాడింటికి ఫోనుచేయించి మరీ వచ్చానండి. ఇంటికివెళ్ళి బట్టలు మార్చుకొని.........'

'ఏం దేంజరు లేదుగదా. డాక్టరు గట్టిగా చెప్పాడా' ఫైర్ అలారంలా మోగింది అతని గొంతు.

'మరేం ఫర్వాలేదండి. అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యం

'ఆ కుర్రాడు కళ్ళుతెరిచి మాట్లాడుతున్నాడా?'.

'చిత్తం.... మొదట్లో కొంతసేపు తెలివిలేదండి. ఇప్పుడు మా అమ్మ కావాలి అని అంటున్నాడండి. ఈపాటికి తల్లిదండ్రులు అక్కడికి వెళ్ళేఉంటారండి।'

మేనేజరు మొహంలోని బాధ క్రమేణా తగ్గింది. 'మీరంతా వట్టి బ్రూట్స్. సైకిలెక్కితే ఏదో పెద్దనిషా వచ్చేసుంది కాబోలు మీ అందరికీ. రోడ్డుమీద పిల్లలు - అమాయకులైన పిల్లలు - ఉంటారని ప్రాథమిక జ్ఞానంకూడా పోతుంది కాబోలు. ఇకనైనా జాగర్తగా మసులుకో. నిన్ను క్షమించాను. నువ్వువెళ్ళి నీపని చూసుకో. నా మనసంతా అదోలా అయి పోయింది' అన్నాడు మేనేజరు.

శాల్యూట్‌చేసి వెనక్కితిరిగి తోటి గుమాస్తాల మధ్యకి వచ్చి పడ్డాడు గంగాధరం. సగర్వంగా సహాసంగా 'ఏం జరిగింది ? ఏం జరి గింది।' అంటూ చుట్టూచేరి అడిగారు అందరూ. 'భాయ్ వీడు గంగాధరం ఏమిటనుకున్నారో,' అంటూ నవ్వుతూ పైల్సుతీసే గంగాధరాన్ని ఏదో మహిమాన్వితుడిలాగా, హఠాత్తుగా అణిమాది సిద్ధులు లభించిన యోగీ శ్వరుడిలాగ వెఱ్ఱిగా చూశారు. మనసులోనే నిర్మలని తలచుకొని ధన్య వాదాలర్పించాడు గంగాధరం.

ఈ ప్రమాదవార్త విని సగం డీలాఅయిన మేనేజరు కాస్సేపట్లో తిరిగి కోలుకొని, ఒక్కసారి నిట్టూర్చి, తన పనిలో నిమగ్నుడయ్యాడో లేదో, గణగణమని టెలిఫోను మోగింది. తాపీగా చెవిదగ్గర పెట్టుకొని 'హలో' అన్నాడు. అవతల కొననుండి కంగారుగా భార్యగొంతు 'ఏమండీ మీరేనా, అయ్యో అర్జంటుగా రండీ. ప్రమాదంఅండీ. అబ్బాయికి ప్రమాదం జరిగిందండీ, ఎవడో సైకిలు మీదనుంచి పోనిచ్చాడండీ. తలంతా రక్త మండీ. త్వరగా రండీ.'